## క్రైం కథ

చదువుతున్న పుస్తకాన్ని మూసి తలగడ కింద వుంచి టేబిల్ లైటును ఆర్పి పడుకుని కళ్లు మూసుకుంది దీపిక. పక్కనే వున్న తన ప్రయివేటు గదిలో కూర్చుని వ్యాపారానికి సంబంధించిన వ్యవహారాలను చూసుకుం టున్నాడు దీపిక భర్త వామనరావు.

కళ్లు మూసుకున్న దీపికకు నిద్ర రాలేదు గానీ హఠాత్తుగా ఎందుకో కనుల ముందు మనోహరం కనిపించాడు. ఆడవాళ్లను సమ్మోహన పరిచే అతని చిరునవ్వు, అంద మైన అతడి రూపం, అతడు తనపట్ల కనబ రిచిన ప్రేమ ఒక్కసారిగా గుర్తుకువచ్చాయి.

అంతేకాదు తను రహస్యంగా ఇంట్లో ఎవరికీ తెలీకుండా అతడితో చూసిన సినిమాలు, తిరిగిన ప్రదేశాలు, గడిపిన రహస్య జీవితం అన్నీ ఒకటొకటిగా గుర్తుకు వచ్చి ఒక్కసారిగా అతడిని చూడాలనే కోరిక బలంగా కలిగింది.

కానీ సాధ్యమేనా?

ఇప్పుడు మనోహరం ఎక్కడున్నాడో తెలీదు. ఎవరినో పెళ్లి చేసుకుని సంసార జీవితం గడుపుతూ వుంటాడు. ఎప్పుడయినా తన గురించి భార్యతో చెప్పి వుంటాడా? చెబితే ఆమె ఎలా రిసీవ్ చేసుకుని వుంటుంది? తను రాసిన ప్రేమ లేఖలు, తను మనోహరం తీయించుకున్న ఫోటోలను అతను భార్యకు చూపించి వుంటాడా? తనకు నమ్మకం లేదు. అంత ధైర్యం ఏ మగాడికీ వుండదు.

దీపిక అలాంటి ఆలోచనల మధ్య వున్నప్పుడు ఆ గదిలోనే వున్న టెలిఫోన్ రింగయ్యింది. మనోహరం ఆలోచనలను వదలడం ఇష్టంలేని దీపిక బెడ్‌మీద నుంచి లేవలేదు.

ఫోన్ రింగవుతూనే వుంది.

# బ్లాక్ మెయిలర్

ఎవరో తెలుసుకుందామని బద్ధకాన్ని వదిలించుకుని లేచి వెళ్లి రిసీవర్ తీసి హలో అన్నది దీపిక.

అవతలి వైపునుంచి బదులుగా ఎవరిదో నవ్వు వినిపించింది.

మళ్లీ 'హలో' అన్నది దీపిక.

ఈసారి కూడా జవాబు లేదు. అతనెవరో కానీ నవ్వుతూనే వున్నాడు.

''ఎవరు?'' దీపిక అడిగింది – ఎవరో తెలుసుకుందామని.

''నన్నే గుర్తుపట్టలేదా దీపికా'' అన్నాడతను మళ్లీ నవ్వి.


''సారీ... గుర్తు రావడంలేదు. ఎవరో చెప్పండి.''

''ఈ మనోహరాన్నే మరచిపోయేలా చేశాడంటే నీ భర్తకు నా అభినందనలు'' అని మళ్లీ నవ్వాడు.

''మనోహరం నువ్వా!'' ఆశ్చ ర్యంగా అన్నది దీపిక వస్తున్న సంతో షాన్ని అణచుకుంటూ.

మనోహరం గురించి ఆలోచి స్తున్నప్పుడే అతను ఫోన్ చెయ్యడం దీపికకు సంతో షాన్ని కలగజేసింది.

''ఇంతకీ నేను ఇంత



రాత్రివేళ ఎందుకు ఫోన్ చేశానో నీకు తెలీదు కదూ'' అడిగాడు.

''అవును. తెలీదు. ఎందుకు? కుశలం కనుక్కోటానికా?'' దీపిక అడిగింది.

''కాదు. ఓ లక్ష రూపాయలు అప్పుగా అడగడానికి''

''లక్ష రూపాయలా?''

''అవును. చాలా అర్జంటు... తప్పనిసరయి నిన్ను అడుగుతున్నాను. నువ్వు ఇవ్వక తప్పదు.''

''లక్ష రూపాయలు నా దగ్గర లేవు'' చిన్నగా అన్నది.

''ఇప్పుడు లేకపోవచ్చు. ఒకటి, రెండు రోజుల్లో ప్రయత్నం చేస్తే నీకు సాధ్యం అవుతుంది. ధనవంతుడి భార్యవి... నాకు స్టోరీలు చెప్పకు. నేను మంచివాణ్ణి కాదు'' మళ్ళీ నవ్వాడు.

''మనోహరం... బెదిరిస్తున్నావా?'' అడిగింది దీపిక.

''అవును. అవసరం అలాంటిది. ఇంతకు మించి నాకు మరో దారి లేదు.''

''సర్లే... ఇవ్వకపోతే ఏంచేస్తావ్?'' అతడేమంటాడో తెలుసుకుందామని అడిగింది.

అతను ఈసారి వెరైటీగా నవ్వి ''దీపికా... నువ్వు గతాన్ని మరచిపోయినట్టున్నావ్. నువ్వు నాకు రాసిన ప్రేమలేఖలు, మనిద్దరం కలిసి రకరకాలుగా తీయించుకున్న రంగుల ఫోటోలు నా దగ్గర భద్రంగా వున్నాయి. వీటిని నీ భర్తకు చూపిస్తాను. అంతటితో ఆగను. నీ భర్తను కూడా వాటితో భయపెడతాను. ఒక గొప్ప ఇండస్ట్రియలిస్ట్ భార్య మంచిది కాదనే విషయాన్ని నలుగురూ తెలుసుకుంటారు. వాటిని న్యూస్‌పేపర్లకు ఇస్తాను. ఇంకా ఏమయినా చేస్తాను. అర్థం చేసుకున్నావనుకుంటాను.''

భయపడింది దీపిక.

''ప్లీజ్.. మనోహరం... అలా చెయ్యకు. ఆయన్ని ఇబ్బంది పెట్టకు. ఆయన చాలా మంచి మనిషి. నన్ను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు. పెళ్లవక ముందు జీవితం నాది. ప్రేమించి నీతో తిరిగాను. నా దృష్టిలో అది తప్పుకాదు. కానీ పెళ్లయిన తర్వాత నా జీవితం ఆయనది. నీతిగా వున్నాను. ఒకప్పుడు నిన్ను ప్రేమించినందుకు నన్ను బాధపెట్టకు. నన్ను వదిలెయ్. ఇంకెక్కడయినా ప్రయత్నం చేసుకో... ప్లీజ్'' అర్థిస్తున్నట్టుగా అన్నది దీపిక.

కానీ అతను వినలేదు.

''మరో దారిలేక డబ్బుకోసం నిన్ను ఎన్నుకున్నాను. నువ్వు ఇవ్వక తప్పదు. లక్ష రూపాయలిస్తే నీకే మంచిది. గుట్టుగా సంసారం చేసుకుంటావ్. అందుకే డబ్బులిచ్చి నన్ను వదిలించుకో... అవసరం మనిషిని రాక్షసుడిగా మారుస్తుందని అర్థం చేసుకో'' అన్నాడు.

''అయితే... నాకు కొంచెం వ్యవధి కావాలి. కనీసం మూడు రోజులు.''

''ఆల్‌రైట్. ఒకప్పుడు నా ప్రేమికురాలివి కాబట్టి నీకు మూడు రోజుల గడువిస్తున్నాను. నాలుగో రోజు లక్ష రూపాయలతో నన్ను కలుసుకోవాలి.''

''ఇంతకీ డబ్బుతో నిన్ను ఎక్కడ కలుసుకోవాలి?'' అడిగింది దీపిక.

''అడ్రసు చెబుతాను గుర్తుంచుకో. రోడ్ నెంబర్ పన్నెండు ... డోర్ నెంబర్ నాలుగువందల పదకొండు ... మైలాపూర్ ... ఐనా రెండ్రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేస్తాను'' అని ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు.

రిసీవర్ పెట్టేసి భారంగా వూపిరి తీసుకుంది దీపిక. ఆమె శరీరం చిన్నగా వణుకుతోంది.

ఏదో ఒకరోజు మనోహరం ఫోన్‌చేసి ఇలా బెదిరిస్తాడని తను వూహించలేదు. తనని ప్రాణప్రదంగా ప్రేమించిన ఇతను ఇలా మాట్లాడుతున్నాడంటే దీపిక ఇప్పటికీ నమ్మలేకుండా వుంది. అతను చెప్పినట్టుగా అవసరం అనేది ఏ మనిషినయినా రాక్షసుడిగా మారుస్తుందా? మూడు రోజుల్లో తను లక్ష రూపాయలను సంపాదించగలుగుతుందా? అవును. తప్పదు. ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే తనకే ప్రమాదం. మనోహరం గురించి తనకు బాగా తెలుసు. అతడిలో సిన్సియారిటీ ఎక్కువ.

దీపిక నిద్రపోయే ప్రయత్నం చేసింది కానీ సాధ్యంకాలేదు. పక్కనే వున్న ప్రయివేటు గదిలో వెలుగుతున్న దీపం ఆరిపోయింది. తర్వాత తలుపులు మూస్తున్న చప్పుడు వినిపించింది.

కాసేపటికి దీపిక భర్త వామనరావు వచ్చి - ''నిద్రపోతున్నావా?'' అని అడిగాడు దీపిక పక్కన పడుకుంటూ.

దీపిక మాట్లాడకుండా పక్కకు తిరిగి పడుకుంది గట్టిగా కళ్లు మూసుకుంటూ.

***

వామనరావు రోడ్డు నెంబరు పన్నెండులోకి తిరిగి వరుసగా డోర్ నెంబర్లను చూసుకుంటూ నడుస్తున్నాడు. అతడి చేతిలో చిన్న బ్రీఫ్‌కేసు ఉంది.

అతను ఒక ఇంటిముందు ఆగి డోర్ నెంబరును ఇంకోసారి చూశాడు. అవును. అదే ఇల్లు.

చిన్న ఇనుప గేటును నెట్టుకుని లోపలకు వెళ్లాడు. చిన్న ఇల్లు. చాలా సాధారణంగా వుంది. ఇంటి బయట మెట్ల పక్కనే క్రోటన్ మొక్కలు వున్న రెండు కుండీలు వున్నాయి.

మెట్లకీ, వరండాకీ మధ్య కొంచెం ఖాళీస్థలం వుంది.

వామనరావు మెట్లెక్కేసరికి ఎదురుగా వరండాలో ప్లాస్టిక్ కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్న మనిషి కనిపించాడు.

''ఎవరు కావాలి?'' అడిగాడతను లేచి నిల్చుని.

అతను అలా అగినప్పుడు అతడి నోట్లోనుంచి పొగ బయటకు వచ్చింది. సన్నగా, పొట్టిగా వున్నాడు. ఎవరో పట్టి లాగుతున్నట్టు లోపలకు పీక్కుపోయిన దవడలు - బయటకు పొడుచుకు వచ్చిన కణుపులు తేలిన పొడవాటి ముక్కు - సిగరెట్లు ఎక్కువగా తాగే అలవాటున్నందున బూడిద రంగులో పొగచూరిన బండ పెదవులు - మీసం లేదు. గడ్డం మీద నల్లటి మచ్చ.

''మనోహరం కావాలి'' చెప్పాడు వామనరావు.

''ఎందుకు?'' అడిగాడతను.

''డబ్బులివ్వాలి'' అన్నాడు వామనరావు చిన్నగా చేతిలో వున్న బ్రీఫ్‌కేసును కొంచెం కదిలించింది.

''ఓ.. దీపిక పంపించిందా. రండి లోపలకు వెళ్లి మాట్లాడుకుందాం'' అని అతను ముందు గదిలోకి నడిచి వామనరావు కూడా వెళ్లాక తలుపులు మూసి బోల్టు వేసి - ''ఇప్పుడు చెప్పండి'' అన్నాడు.

''దీపిక డబ్బు పంపించింది మనోహరం'' అంటూ వామనరావు బ్రీఫ్‌కేసును అతడికి ఇచ్చాడు.

ఇచ్చి - ''సరిగా వున్నాయో, లేవో చూసుకో'' అన్నాడు.

అప్పుడు అతను వెనక్కు తిరిగి గోడ పక్కనే వున్న చెక్కబల్ల మీద వుంచి బ్రీఫ్‌కేసులో నుంచి నోట్ల కట్టలను బయటకు తీశాడు.

వామనరావు చిన్నగా నవ్వి ప్యాంటు జేబులో నుంచి పొడవుగా వున్న కత్తిని బయటకు తీసి వెనకనుంచి ఎడమ చేత్తో అతడి నోరు మూసి కుడిచేత్తో బలంగా కత్తితో అతడి వీపులోకి పొడిచాడు.

అతను చిన్నగా మూలిగి పడిపోకుండా బల్లను పట్టుకుని ''ఏమిటిది?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''నమ్మకద్రోహానికి శిక్ష మనోహరం'' అన్నాడు వామనరావు.

''నేను మనోహరాన్ని కాదు'' అన్నాడతను గొంతు పెగుల్చుకుని.

''మరి నువ్వెవరు?'' వామనరావు అడిగాడు.

''మనోహరం రూమ్మేటుని... నా పేరు సదానందం. నాకు వాళ్లిద్దరి గురించి అంతా తెలుసు. నా దగ్గర ప్రేమలేఖలు లేవు. ఫోటోలు లేవు. డబ్బుకోసం ఈ నాటకం ఆడాను. రెండేళ్ల క్రితం మనోహరం ఓ యాక్సిడెంటులో పోయాడు'' చెప్పాడు సదానందం.

''నువ్వు ఎవరయినా దీపికను బెదిరించినందుకు, భయపెట్టినందుకు శిక్ష తప్పదు'' అని వామనరావు ఇంకోసారి పొడిచాడు.

''ఇంతకీ మీరెవరు? నా గురించి దీపిక చెప్పిందా?'' అడిగాడు సదానందం కిందకు పడిపోతూ.

''దీపిక భర్తను. మీ సంభాషణనంతా ఎక్స్‌టెన్షన్ ఫోన్‌లో విన్నాను'' చెప్పాడు వామనరావు కత్తి పిడిమీద వేలిముద్రలను తుడుస్తూ.

**- ప్రతాప రవిశంకర్**